

8న వాలీబాల్ పోటీలు

కడప అర్బన్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 8 న వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువ అధికారి కె.మణికంత ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ మీట్ ను యూత్ హాస్టల్ లోనే ప్రాంగణంలో జిల్లాలో ని యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీలలో 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ళ వయసు గల జిల్లాలోని యువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలుకు నగదు బహుమతులు, మెమోంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కోసం 9398391912, కడపలోని బాలాజీ నగర్ లో ఉన్న నెహ్రూ యువ కేంద్ర కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

మాడిఫికేషన్ పోస్టింగులకు తెరపడేనా!

సీనియర్ ఎంఎల్‌హెచ్‌పిలపై వేధింపులు
ఇతర జిల్లాలకు వెళ్లాల్సిందేనంటూ హుంకరింపు
15 మందికిపైగా ఎంఎల్‌హెచ్‌పిల్లో ఆందోళన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాడిఫికేషన్ ఉత్తర్వుల పేరుతో చేపట్టిన ఎంఎల్‌హెచ్‌పి పోస్టింగుల వ్యవహారంలో గందరగోళం నెలకొంది. ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారుల తప్పిదాల వల్ల మాడిఫికేషన్ పోస్టింగులు, రెండేళ్లుగా ఎంఎల్‌హెచ్‌పిలుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మాడిఫికేషన్ ఉత్తర్వుల కింద ఖాళీ చేసిన స్థానాలను గుర్తించి పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. జిఓ ప్రకారం ప్రయత్నం చేయకుండా ఉద్దేశపూర్వకంగా పోస్టింగులు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా గత డిసెంబర్ 15న రీజియన్ పరిధిలోని 3,106 ఎంఎల్‌హెచ్‌పిలను ఏడు బ్యాచ్‌లుగా విభజించింది. అనంతరం క్రమపద్ధతిలో బదిలీలకు శ్రీకారం చుట్టింది. వెకెన్సీ నోటీసు విడుదల చేయడం, దానికి అనుగుణంగా పోస్టింగులను భర్తీ చేయాల్సి ఉంది. 324 మందిని గుర్తించినట్లు సమాచారం. వీరిలో 240 మందిని మ్యాపింగ్ చేసింది. కడప జిల్లాలో ముగ్గురు, అన్నమయ్య జిల్లాలో ముగ్గురు, మిగిలిన ఆరు జిల్లాలలో కలిపి 15 మంది నుంచి 20 మంది ఎంఎల్‌హెచ్‌పి పోస్టింగులను మాడిఫికేషన్ ఉత్తర్వుల కింద భర్తీ చేసినట్లు సమాచారం. కడప జిల్లాలోని బద్వేల్ మండల పరిధిలోని తొట్టిగారిపల్లి పిహెచ్‌సి, పోరుమామిళ్ల పిహెచ్‌సిలకు కేటాయించిన ఎంఎల్‌హెచ్‌పిలను చిత్తూరు జిల్లాకు చెందిన ఎంఎల్‌హెచ్‌పిలను బదిలీ చేసినట్లు తెలిసింది. చిత్తూరు జిల్లా రామకుప్పం పిహెచ్‌సికి చెందిన ఓ ఎంఎల్‌హెచ్‌పి రెండేళ్లుగా విధులు నిర్వహిస్తోంది. ఆమె స్థానంలో ఎనిమిదవ బ్యాచ్‌కు చెందిన ఎంఎల్‌హెచ్‌పి పోస్టింగ్ ఇవ్వడం, ఆమె వెంటనే విధుల్లో చేరిపోవడం జరిగిపోయింది. ఆమె ఆర్‌డిని కలిసిన సమయంలో సీనియర్ విధులు నిర్వహిస్తున్నందున రామకుప్పం పిహెచ్‌సిలోకి ఎవరూ రారని, ప్రశాంతంగా వెళ్లాలని పేర్కొన్న ఆర్‌డి రాత్రికి రాత్రే అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆర్‌డి కార్యాలయం



సూచించిన పిహెచ్‌సిలకు వెళ్లి జాయిన్ కావాలని హుకుంజారీ చేసినట్లు సమాచారం. వెకెన్సీ నోటీసులో పేర్కొన్న స్థానాలకు పోస్టింగులు ఇవ్వాల్సిన ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు, ఆర్డీవల్ స్థానాలకు పోస్టింగులు ఇవ్వడంలో అంతర్యం ఏమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. కడప రీజియన్ పరిధిలోని బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి పిహెచ్‌సి, పోరుమామిళ్ల పిహెచ్‌సిలకు పోస్టింగులు ఇచ్చినంతలోనే సొంత జిల్లా చిత్తూరుకు పోస్టింగులు దక్కించుకోవడం వెనుక మతలబేమిటో అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లా రామకుప్పం పిహెచ్‌సిలో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పి అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పిహెచ్‌సిలకు వెళ్లి తీరాల్సిందేనని వేధించడం విస్మయానికి కలిగిస్తోంది. మాడిఫికేషన్ ఉత్తర్వుల కింద రీజియన్ పరిధిలో 15 నుంచి 20 మంది ఎంఎల్‌హెచ్‌పిలను బదిలీలు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి బదిలీలు, నియామకాల్లో చోటుచేసుకున్న నిబంధనల ఉల్లంఘనల్ని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

డబుల్ పోస్టింగులు ఇవ్వడం తగదు

ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల డబుల్ పోస్టింగులు ఇవ్వడం నిబంధనలు ఉల్లంఘించడమే. రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిల స్థానాలకు మరొకరిని పంపించడం అన్యాయం. ఇటువంటి అన్యాయాలను సరిదిద్దాలి. తక్షణమే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం.

- వెంగల్‌రెడ్డి, మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు. కడప.

నాడు-నేడు పనుల్లో నాణ్యత తప్పనిసరి : జెసి

ప్రజాశక్తి - కడప అర్బన్

నాణ్యతను పాటిస్తూ మనబడి నాడు నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కొత్త కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో మనబడి నాడు నేడు ఫేస్-2 పనుల పురోగతి పై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మనబడి నాడు -నేడు రెండవ దశలో భాగంగా రూ.288 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 998 పాఠశాలలు, 9 జూనియర్ కాలేజీలలో చేపట్టిన పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలుంటే సంబంధిత అధికారుల పైన చర్యలు తప్పవని అన్నారు. మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, ఇంజినీరింగ్ అధికారి ఎప్పటికప్పుడూ ప్రతి పనిని తనిఖీ చేస్తూ నివేదిక అందించాలని చెప్పారు. ప్రతి పాఠశాలకు సంబంధించిన టాయిలెట్స్, తాగునీరు , విద్యుదీకరణ, లైట్స్, మేజర్ అండ్ మైనర్ రిపైర్స్, కాంపౌండ్ వాల్సు, అదనపు తరగతి గదులు కిచెన్ షెడ్ సంబంధించిన పనులు ఎప్పటికప్పుడూ గ్రామ, వార్డు సచివాలయం ఇంజనీర్స్ ఫొటోస్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎస్‌టిఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే మన జిల్లాకు రూ56.08 కోట్లు రివలింగ్ ఫండ్ రూపంలో విడుదల అయ్యాయని, ఇందులో రూ.51.87 కోట్లు ఖర్చు చేసామని మిగిలిన మొత్తం కూడా మరో వారం రోజులు లోపల పూర్తి చేయాలని ఇంజి నీరింగ్ అధికారులను ఆదేశించారు. సమగ్ర శిక్ష పిడి అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడూ ఖర్చులు, మెటీయర్‌కు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు, పంచాయతీరాజ్ ఎస్‌సి శ్రీనివాసుల రెడ్డి , ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ వీరన్న, ఏపీ ఈడబ్ల్యుఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరుణాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, మండల ఇంజినీర్లు, మండల విద్యాశాఖ అధికారులు సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, సమగ్ర శిక్ష కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి సాయికాంత్‌వర్మ

హక్కులను కాలరాస్తే పుట్టగతులుండవ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం స్వేచ్ఛ హక్కులకు, పౌర హక్కులకు భంగం కలిగించే విధంగా రాజ్యాంగ హక్కులు కాల రాస్తే పుట్టగతులు ఉండవని, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రపంచ నియంత హిట్లర్ లా వ్యవహరిస్తే ప్రజలు స్టాలిన్ లు అయ్యి తిరగబడతారని, రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తారని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. శుక్రవారం జీవో నంబర్ 1ని వెనక్కి తీసుకోవాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్రలు, ఓదార్పు యాత్రలు, రోడ్ షోలు, రోడ్లపై సభలు, సమావేశాలు, దీక్షలు చేయచ్చు కానీ జగన్ అధికారంలో ఉంటే ప్రతిపక్షాలు, ప్రజలు చేయకూడదా అని ప్రశ్నించారు. రాజ్యాంగం నీ ఒక్కనికే హక్కులు కల్పించలేదని అందరికీ సమాన హక్కులు కల్పించిందన్న విషయం జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. జీవో నెంబర్ 1 రద్దు చేసే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, అమీర్ బాబు, లక్ష్మి రెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సత్తార్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, బీఎస్పీ నాయకులు గుర్రప్ప, లోక్ సత్తా నాయకులు కృష్ణా, జనతాదళ్ (యు)నాయకులు ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎమ్ వి సుబ్బారెడ్డి, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ చిన్న సుబ్బయ్య పాల్గొని ప్రసంగించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర

ఏపీపీఎస్సీ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కడప

ఈ నెల 8న జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ (గ్రూప్-1) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విసి హాలులో పరీక్షల నిర్వహణపై పరీక్షల జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు ఎన్. ప్రమీల (అసిస్టెంట్ సెక్రెటరీ, మానిటర్), సి.హెచ్. వి. సాయి ప్రకాశ్ (సెక్షన్ ఆఫీసర్)లతో కలిసి పరీక్షల విధులు కేటాయించిన లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ. ఆదివారం రెండు విడతలుగా ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పరీక్షలను పటిష్ఠంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కోవిడ్ నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరువైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 కంట్రోల్ రూమ్ నెం. 08562-246344 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.


మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధరగౌడ్



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

మెడిసిన్ విద్యార్థులకు ఫీజులు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో 2015-16 సంవత్సరానికి చెందిన విద్యార్థుల చదువు కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రూ. 9.70 కోట్ల ఫీజు నిధులను విడుదల చేశారని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. నిధులు నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారన్నారు. శుక్రవారం ఫాతిమా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ఫాతిమా మెడికల్ సైన్సెస్ 2015-16 సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులు గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. 45 రోజులు విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించలేదన్నారు. వారి భవిష్యత్‌పై తల్లి దండ్రులు కన్న కలలు వృథా కాకుండా వారికి మంచి భవిషత్ కల్పించడానికి ముఖ్యమంత్రి నిధులు విడుదల చేశారన్నారు. సమావేశంలో కార్పొరేటర్ షేక్. మహమ్మద్ షఫీ, ఎన్ఆర్ఐ తోటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ 171వ వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆరు చుక్కల స్పర్శలిపితో అంధులకు విద్యాదానం చేసిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ 171 వర్ధంతిని పజా సహాయార్థం ఆంధ్ర ప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంగడీ వీధిలోని అనాథ వికలాంగుల సేవాకేంద్రంలో నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి, ఎస్.కమాల్ బాషా లూయిా చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. లూయిా బ్రెయిలీ కేవలం బ్రెయిల్ లిపిని కనుగొనడమే గాక సంగీత విద్వాంసుడని, సెల్లో, ఆర్గాన్ అద్భుతంగా వాయించేవాడని కమాల్‌బాషా పేర్కొన్నారు. రాఫేగ్రాఫ్ అనే టైప్ రైటర్ నిర్మాణంలో కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి కమాల్ బాషా, సంస్థ సభ్యులు గోపాల్, వీరేష్, ఖజవల్లి, కిషోర్, నాగార్జున, రసూల్, వెంకటరెడ్డి, రాజమోహన్ పాల్గొన్నారు.


బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంధులు

ప్రజల చెంతకే సేవలు : డిప్యూటీ సిఎం

కడప : ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 42 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ చల్లా స్వప్న, ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్, 43 వ డివిజన్ పరిధిలోని పి. శ్రీలేఖ, ఇన్‌ఛార్జ్ పి. రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లోని పాత లా కాలేజ్ వీధి వద్ద గల పలు వీధులలో ని పలు ప్రాంతాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా, డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు షేక్ మహమ్మ షఫీ, బాల స్వామి రెడ్డి, నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, జమాల్‌వల్లి, పసుపులేటి మనోజ్ కుమార్, నాయకురాళ్లు టి.వి.సుబ్బమ్మ, పసుపులేటి విజయకుమారి, మరియమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కలసపాడు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల నుంచి కొత్త పింఛన్లను అందజేస్తున్నామన్నారు. ఒకొక్కరికీ రూ. 250 పెంచారని తెలిఆపరు. . రానున్న ఎన్నికల కు వాలంటీర్లు, సచివాలయ బూత్ కన్వీనర్లు వారదులుగా ఉండి అత్యధిక మెజార్టీతో జగన్మోహన్ రెడ్డిని గెలిపి ంచాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ బూబ్, ఇఒపిఆర్‌డి జి. మురారి, ఎఒ వరద రాజులు, ఎంపిపి నారాయణ, జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, మాజీ ఎంపిపి, రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి, ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ నెంబర్ సుదర్శన్, మాజీ ఉప మండల అధ్యక్షుడు ఏ. భాస్కర్ రెడ్డి, కొత్త కోట సహకార బ్యాంకు ప్రెసిడెంట్ పి. పురుషోత్తం రెడ్డి, కలసపాడు సర్పంచ్,శివలీల, ఉప సర్పంచ్ వీరారెడ్డి, వైసిపి నాయకులు మాజీ సర్పంచులు బి. బాల వెంకటరెడ్డి, లక్ష్మిరెడ్డి, రాం బాబు, ఎంపీటీసీలు రమేష్, సెక్రటరీలు పాల్గొన్నారు.




పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

అర్హతే ప్రామాణికంగా పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అట్లూరు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు కులాలు, పార్టీలకు అతీతంగా అంది స్తున్నామని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపిడిఒ ఆధ్వర్యంలో కొత్తపింఛన్లను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందడించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నామని, ఏ ఒక్కరి పింఛను తొలగించాలని చెప్పారు. కారన్యక్రమంలో తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ సుజాతమ్మ, వైసిపి నాయకులు అందరూరి రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, రెడ్డయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధా

దొంగనోట్ల చలామణి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - మైదుకూరు

దువ్వూరు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని కానగూడూరు పూల మార్కెట్ సమీపాన దొంగనోట్లు చలామణి చేస్తున్న ముగురిని అరెస్టు చేసినట్లు మైదుకూరు డిఎస్‌పి ఎస్.ఆర్. వంశీధర్‌గౌడ్ పేర్కొన్నారు స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేశామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.200, రూ.500 నోట్లను, ఒకవైపు మాత్రమే ముద్రిదంచిన రూ.500 నోట్లను, మూడు సెల్‌ఫోన్లను, ఒక ల్యాప్‌టాప్, కలర్‌ప్రింటర్, ల్యామినేటర్, పేపర్‌కటింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మాచర్యల పట్టణానికి చెందిన పేర్ల యేసయ్య, గంగవరపు సాగర్ రెడ్డి, యంగనంపల్లె కోటేశ్వరరావు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో యేసయ్య అనే వ్యక్తి గతంలో పలు కేసుల్లో మెదటి ముద్దాయిగా ఉన్నాడని డిఎస్‌పి చెప్పారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ ఎన్. నరేంద్రరెడ్డి, దువ్వూరు ఎస్ఐ ఆర్. రాఘవేంద్రరెడ్డి, సబ్ డివిజనల్ క్రైమ్ పార్టీ రామ్‌భూపాల్‌రెడ్డి, ఎఎస్ఐ నాగేంద్ర, కానిస్టేబుల్ అమరేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రావు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వంశీధర్‌గౌడ్

కారుణ్య నియామకాలు చేపట్టాలి

పోరుమామిళ్లటౌన్ : విద్యుత్‌శాఖలో పెండింగ్‌లో ఉన్న ఇఎస్ఐ, ఇపిఎఫ్, కారుణ్య నియామకాలు చేపట్టాలని, హైకోర్టు ఉత్తర్వు ప్రకారం వాచ్‌మెన్‌లను షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలని సిఐటియు జిపాధ్యక్షులు బైరవప్రసాద్, జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల సర్వీసు ఇన్సెంటివ్‌ను కొనసాగించాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కడప డివిజన్‌లో హై కోర్టు ఉత్తర్వుల ద్వారా వాచ్‌మెన్ నుంచి షిప్టు ఆపరేటర్‌గా నియమించిన హరికేశవరెడ్డికి ఇపిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకుండా వేధిస్తున్న జి.వి. రమణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమా వేశంలో యుఇయు రాష్ట్ర కమిటీ సభ్యులు లక్షుమయ్య, మైదుకూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి పి.సి. కొండయ్య, జిల్లా కమిటీసభ్యులు నౌషాద్, పోరుమామిళ్ల సబ్‌డివిజన్ అధ్యక్షులు మాబూ, కమిటీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, స్వామి, గోపి, రమణారెడ్డి, బాలయ్య, రంగస్వామి, ఈసాఫ్, రమేష్, బాలాజీ, తిరుమలయ్య పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోవడం బాధాకరం

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా మొదటి తేదీన జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉండడం చాలా బాధాకరమన్నారమని ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివా అర్జున అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగం అన్నారు. ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు చెల్లించడం, సకాలంలో బిల్లులను చెల్లించడం, వారికి రావాల్సిన డిఎలు ఇవ్వడం ప్రభుత్వ మొదటి బాధ్యత అన్నారు. ఇప్పటికీ పిఎఫ్ రుణాలు, సరెండర్ లీవు బిల్లులు, ఏపిజిఎల్ఐ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

న్యాయ సాయం ప్రారంభం

కడప : స్థానిక జిల్లా కోర్టు ఆవరణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాయ సాయం, రక్షణ సలహా వ్యవస్థను ఎపి రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కడప హెడ్ క్వార్టర్స్‌లో క్రిమినల్ కేసులలో న్యాయవాదులను నియమించుకునే స్థోమత లేని వారు న్యాయ సాయం ద్వారా ఉచిత న్యాయం పొందవచ్చన్నారు. న్యాయ సాయం, రక్షణ సలహా వ్యవస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎన్.హరి బాబును, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పి.మనోహర్‌ను నియమించారు.

భట్రాజు పొగడ్తలు.. సామెత నిషేధం

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'భట్రాజు పొగడ్తలు' అనే సామెతను ఎక్కడా ఏ సందర్భంలోనూ ప్రజలు వాడకూడదని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 డిసెంబర్ 20వ తేదీన రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జారీ చేసిన జీవో. 60 ప్రకారం సామెతను వాడకంపై నిషేధ ఆంక్షలను విధించారన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి తూచా తప్పక పాటించాలన్నారు.

నేటి నుంచి హిస్టరీ కాంగ్రెస్ సదస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 45వ వార్షిక సదస్సులు ఈనెల 7,8 తేదీల్లో వైవీయూలో నిర్వహించనున్నట్లు ప్రఖ్యాత చరిత్రకారులు ఆచార్య వకులాభరణం రామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ లోకల్ సెక్రటరీ ఆచార్య కంకణాల గంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రెడ్డితో కలిసి సి పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర రచన, పరిశోధన, అధ్యయనం కోసం నాలుగు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి చేయుచున్న 'ఆంధ్ర ప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్"45వ సమావేశం ఆచార్య గంగయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు, ఉత్తరప్రదేశ్, కాశ్మీర్, పాండిచ్చేరి, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి చరిత్ర కారులు, పరిశోధకులు, విద్యార్థులు, చరిత్ర ప్రేమికులు పెద్ద ఎత్తున హాజరై పరిశోధక పత్రాలను సమర్పిస్తారని చెప్పారు. సమావేశంలో చరిత్రకారులు శ్రీనివాసరెడ్డి, కొప్పర్తి మూర్తి, వెంకట్రామయ్య, మురళీమోహన్, నాగార్జున, సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున్‌రెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ ఎస్ వి సుబ్బారెడ్డి, డాక్టర్ టి. సురేష్ బాబు, బాలకొండ గంగాధర్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - కడప

విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.ఎన్. ప్రసాద్ అన్నారు. శుక్రవారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలోని తన చాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి మానవ వనరులు విలువైనవని పేర్కొన్నారు. సిబ్బంది విధులు నిర్వహించేటప్పుడు తమ వద్ద కచ్చితంగా ఇండక్షన్ టెస్టర్, ఎర్త్ పైపు, రబ్బరు తొడుగులు, బెల్టు కలిగి ఉండవలెను ఆదేశించారు. పనులు చేసేటప్పుడు విధిగా సంబంధించిన లైను ఎర్తింగ్ చేసుకొని పనులు కొనసాగించాలని తెలియజేశారు. విద్యుత్ భద్రత ప్రమాణాలు విధిగా పాటించి విద్యుత్ ప్రమాదాలు అరికట్టాలని తెలియజేశారు. నీటిలో నిలబడి విద్యుత్ మోటార్లను, స్విచ్ (స్టార్టర్) లను సంబంధిత విద్యుత్ పరికరాలను తాకరాదని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి సదస్సులు నిర్వహించాలని చెప్పారు. **విద్యుత్ ప్రమాదాలపై అవగాహన** విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, సిబ్బంది విద్యుత్ ప్రమాద రహిత భద్రత సూచనలను తప్పక పాటించాలని హెచ్ఆర్‌డి చీఫ్ జనరల్ మేనేజర్ డి. ఎస్. వరకుమార్ అన్నారు. విద్యుత్ ప్రమాదలపై శుక్రవారం కడప బాలాజీ నగర్ విద్యుత్ ఉపకేంద్రంలో సాయంత్రం జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్ ముని శంకరయ్య విద్యుత్ ప్రమాదాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర కుమార్ మాట్లాడుతూ సిబ్బందికి సంస్థ విద్యుత్ ప్రవాహం తెలుసుకోవడానికి ఇండక్షన్ టెస్టర్, రబ్బరు తొడుగులు, ఎర్త్ రాడు తదితర సేఫ్టీ పరికరాలు ఇచ్చిందని చెప్పారు. వీటిని సిబ్బంది విద్యుత్ పనులు చేసేటప్పుడు విధిగా ఉపయోగించాలని ఆదేశించారు. కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. సిబ్బంది విద్యుత్ ప్రమాద రహిత భద్రత సూచనలను పాటించి విద్యుత్ ప్రమాదాలు అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్

9 నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-వల్లూరు

అక్షింతరాయపల్లి ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 9 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్గనైజర్ ధనుంజయ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు ముందుగా అక్షింతరాయపల్లె క్రీడా మైదానంలో 8వ తేదీల్లోగా రూ. 800 చెల్లించి పేర్లు నమోదు చేసుకుని రసీదు తీసుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ. 25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు అందజేస్తామన్నారు.

కార్మికులకు చెక్కులు పంపిణీ


ప్రజాశక్తి - కడప

స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో కార్మికులకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలం కొండపేట వద్ద ఉన్న షుగర్ ఫ్యాక్టరీ లో పని చేసే 485 మంది కార్మికులకు 2012 మార్చి నుండి 2022 ఏప్రిల్ వరుకు రావాల్సిన రూ. 13.8 కోట్ల అరియర్స్ ప్రభుత్వం నుంచి ఇప్పించి, చెక్కును శుక్రవారం అందజేశారు. సందర్భంగా కార్మికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎవరికివారు తమ పరిసరాలను, ఇళ్లలోను శుభ్రత పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శుక్రవారం నాగలకట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలేరియా, డెంగీ జ్వరాలు మంచినీటిలో పెరిగే దోమల వల్ల మాత్రమే ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతాయని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ఎవరికివారు డ్రై డే పాటించాలని కోరారు. కార్యక్రమంలో నాగలకట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ జి.నవీన్, మలేరియా యూనిట్ అధికారి బి.సుబ్బారావు, పట్టణ ఆరోగ్య కేంద్రసిబ్బంది మహమ్మద్, చంద్రశేఖర్, కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, మైలవరం మండలాలకు సంబంధించిన అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండాపురం మండలంలోని వెంకయ్య కాల్వ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త (ఒసి), దత్తాపురం-1 కార్యకర్త (ఒసి), కే.బొమ్మేపల్లి కార్యకర్త (బిసి-సి), లావనూరు సహాయకురాలు (బిసి), ఏటూరు సహాయకురాలు (ఎస్సి), ముద్దనూరు మండలంలోని చిన్నదుద్యాల గ్రామంలో సహాయకురాలు (ఎస్సి), ముద్దనూరు-1 సహాయకురాలు (బిసి-బి), మైలవరం మండలం రామచంద్రాయపల్లె గ్రామంలో సహాయకురాలు (ఎస్సి), మైలవరంలోని సహాయకురాలు (బిసి-సి), జంగాలపల్లెలో సహాయకురాలు (తక్షణ విభిన్న ప్రతిభావంతులు) ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 11లోపు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సిడిపిఒ వివరించారు.

పులివెందుల రూరల్ : పులివెందుల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు ఖాళీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేశామని ఐసిడిఎస్ అధికారి శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ పోస్టులు.. పులివెందుల పట్టణంలో బ్రాహ్మణపల్లి, నగిరిగుట్ట, వేముల మండలంలో నారెడ్డిపల్లి, సహాయకురాలు పోస్టులు.. పులివెందుల పట్టణంలోని నాగిరెడ్డిగుట్ట, పాలిరెడ్డి ఫంక్షన్ హాల్, వెంకటాపురం, సింహాద్రిపురం మండలంలోని బొజ్జాయపల్లి, సుంకేసుల, వేముల మండలంలోని మిడిపెంట, నారేపల్లి, వేల్పుల-1, గొందిపల్లి, లింగాల మండలంలోని కర్ణపాపాయపల్లి, మినీ టీచర్ వేముల మండలంలోని శేషయ్యగారిపల్లెలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 11వ తేదీ లోపు దరఖాస్తులను తమ కార్యాలయానికి పంపాలని ఆమె సూచించారు.

దళితుల పట్ల వివక్ష తగదు

ప్రజాశక్తి - మైదుకూరు

దళితుల పట్ల నాయకుల వివక్ష తగదని ఎంపి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మిద్దె వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప టౌన్ రవీంద్రనగర్‌లో గురువారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పలు సమస్యలపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేత కెవిన్ రాజు అడిగారని, అసక్తి పడాలంటే ఉప ముఖ్యమంత్రి మాట్లాడడం సబబుకాదన్నారు. అంజద్‌బాషా వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు.

యువశక్తి సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మైదుకూరు

ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా రణస్థలం వేదికగా యువశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక జనసేన యువశక్తి ప్రచార గోడప్రతికలను ఆ పార్టీ సీనియర్ నాయకులు చిలంగారి కృష్ణమూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేవన్నారు. జాబ్ క్యాలెండర్ లేక ఉద్యోగార్థులు ఎలా మోసపోయారో యువశక్తి వేదిక మీదుగా జనసేనాని, ఆయనతో పాటు 100 మంది యువత ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామగోవింద, విజయ్, విశ్వేశ్వరయ్య, యూసఫ్ రంగా, సురేంద్ర, మోహన్, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

అరుంధతికి వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ విభాగం పరిశోధక విద్యార్థిని మేసా అరుంధతి కి వైవీయూ డాక్టరేట్ ప్రకటించింది. జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ బి. రమేష్ పర్యవేక్షణలో "ప్రిపరేషన్ క్యారెక్టరైజేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ ప్లాంట్ డెరైవ్డ్ ఇండ్యూసర్ అండ్ ఎస్ సిల్వర్ బేస్డ్ కెటోకాన్ నానో పార్టికల్స్ (సిల్వర్‌ఎన్‌పిఎస్ -సిఎన్‌పిఎస్) ఫర్ ఇండ్యూస్డ్ రెసిస్టెన్స్ ఇన్ టమోటా ప్లాంట్స్ అగైనెస్ట్ నెక్స్ పోసారియం ఆక్సిస్పోరం ఎఫ్ ఎస్ ఎల్ అంశం"పై పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని పరీక్షల విభాగానికి సమర్పించారు. ఈ మేరకు సూక్ష్మ కళాశాల మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం పరిశోధకురాలు అరుంధతి రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించి నిష్ణాతుల సంఘం డాక్టరేట్ అర్హత ధృవీకరించారు.

టిడిపి ప్రభంజనాన్ని ఆపలేరు : 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా టిడిపి ప్రభంజనాన్ని ఆపలేరని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలోని మండిపల్లి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రజలలో వస్తున్న ఆదరణను జగన్ ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు సభలకు ఇసుకవేస్తే రాలని తీరుగా జనం వస్తున్న జన సంద్రమే దీనికి ఉదాహరణ అని చెప్పారు. ప్రజాదరణను తట్టుకోలేని జగన్ రాత్రికి రాత్రే తెలుగుదేశం పార్టీ ప్రభంజనానికి ఎలాగైనా ఆపాలని కుట్రలు పన్ని ఎప్పుడో పురాతన బ్రిటిష్ కాలంనాటి జీవోను అమలు చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. జీవోపై రాష్ట్రంలో ప్రతిపక్షాలు, వామపక్షాలు, ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నారని చెప్పారు. ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులకు రక్షణ ఉండాల్సిన పోలీసు నేడు వైసిపి కార్యకర్తల వ్యవహరించడం దారుణమని వాపోయారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కుప్పం ప్రజలు చంద్రబాబుకు బ్రహ్మరథం పట్టారన్నారు.

లైఫ్ స్టైల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప సంధ్యా సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన లైఫ్ స్టైల్ స్టోర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవరాజన్ అయ్యర్ మాట్లాడుతూ నగరాలలో పెరుగుతున్న ఆధునిక ఫ్యాషన్స్‌కు తగినట్లు లైఫ్ స్టైల్ విస్తరణను చేపడుతున్నామన్నారు. కడప ప్రజల ఆధునిక ఫ్యాషన్ పట్ల కలిగి ఉన్న ఆసక్తి, అవసరాలను దృష్టిలో ఉంచుకుని పురుషులు, స్త్రీలు, పిల్లలకు కావాల్సిన అనేక ప్రముఖ బ్రాండ్ జాతీయ, అంతర్జాతీయ ఫ్యాషన్లు అన్నింటినీ ఒకే చోట పొందే సౌలభ్యాన్ని కల్పించేందుకు లైఫ్ స్టయిల్ స్టోర్ కలిగిస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం లైఫ్ స్టయిల్ పైగా నగరాలలో 908 పైగా స్టోర్స్ కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. కడప నగరంలో తమ నూతన స్టోర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దేవరాజన్ అయ్యర్

గదులు పూర్తయ్యేనా.. చదువులు సాగేనా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతాం.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య బోధన.. అంటూ ప్రభుత్వము విద్యాశాఖ అధికారులు గొప్పగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడే తరగతి గదుల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఆ పనులు మొదటి దశలో ముమ్మరంగా జరిగినా, రెండో విడత వచ్చేసరికి నెమ్మదించాయి. గుత్తేదారులకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో తరగతి గదుల నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు, పుల్లూరు పంచాయతీలోని సర్వర్‌ఖాన్‌పేట ఉర్దూ పాఠశాల తరగతి గదులు అసంపూర్తిగా ఉండిపోయాయి. బిల్లులు వస్తాయో రావో అనే అపనమ్మకంతో గుత్తేదారులు పనులు చేపట్టేందుకు అయిష్టత కనబరుస్తున్నారు. నాడు-నేడు ద్వారా చేపట్టనున్న పనులకు నిధులు త్వరగా మంజూరు చేస్తే పాఠశాలల భవనాలను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని గుత్తేదారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న సర్వర్‌ఖాన్‌పేట ఉర్దూ పాఠశాల నిర్మాణం

2024 ఎన్నికల్లో పులివెందుల టిడిపి కైవసం



మాట్లాడుతున్న ఆర్.శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

2024 ఎన్నికల్లో పులివెందుల టిడిపి కైవసం చేసుకుంటుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని స్థానిక 9వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులలో వైసిపి పట్ల ప్రజలు విసుగు చెందారని తెలిపారు. కుప్పంలో చంద్రబాబును ఓడించి తీరుతామని ప్రగల్భాలు పలుకుతున్న వైసిపి నాయకులు, ముందు పులివెందులలో గెలిచి చూపించాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వైసిపి తుంగలో తొక్కిందని విమర్శించారు. మద్యం పాలసీ, ఇసుక దందా, విద్యుత్ ఛార్జీల పెంపు, నిత్యావసరాల సరుకుల ధరలు పెరిగి పేదల జీవన పరిస్థితి చిన్నాభిన్నమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేలా వైసిపి ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వివిఎస్ ముక్తియార్, పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిశెట్టి సురేంద్ర, రాష్ట్ర లీగల్ సెల్ గుర్రప్ప యాదవ్, రాజుపాలెం మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, పర్లపాడు ఇన్‌ఛార్జి వెంకటసాయిరెడ్డి, మాజీ సర్పంచు జయరామిరెడ్డి, హరోన్ పాల్గొన్నారు.

మాట నిలుపుకునే గొప్ప వ్యక్తి సిఎం జగన్

ప్రజాశక్తి - మైలవరం

ఇచ్చిన మాటను నిలుపుకునే గొప్ప వ్యక్తి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ నూతన సంవత్సర పింఛన్ కానుక కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్న పథకాల అమలులో భాగంగా పింఛను పెంచారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సావిత్రమ్మ, అధికారులు, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వై.శివభాస్కర్‌రెడ్డి, జడ్పిటిసి మహాలక్ష్మి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పింఛన్లు పెంచిన ఘనత వైసిపిదే

చాపాడు : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను పెంచారని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. మండలంలోని మడూరు గ్రామంలో శుక్రవారం కొత్తగా మంజూరైన, రూ.2,750 పెరిగిన పింఛన్ల డబ్బులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పింఛను పెంచడం వల్ల ఎంతో మంది పేదలకు ఉపయోగంగా ఉందన్నారు. మండల పరిధిలో 171 నూతన పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, పార్టీ మండల నాయకులు అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, ఎంపిటిసి సీమోను, మడూరు సర్పంచు పి.బాల ఓబుళమ్మ, అన్నవరం సర్పంచు పీరయ్య, పంచాయతీ కార్యదర్శి బాగ్యలక్ష్మీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



మడూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి

కొనసాగుతున్న జగనన్న భూ రక్ష పథకం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో 2వ విడతలో భాగంగా 10 రెవెన్యూ గ్రామాల్లో జగనన్న భూ రక్ష పథకం కొనసాగుతోంది. ఆ మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు సర్వేయర్ స్నేహలత తెలిపారు. మొదటి విడతలో వెంగన్నగారిపల్లెలో పథకాన్ని అమలుపరిచి రైతులకు పత్రాలను కూడా అందించామన్నారు. ప్రస్తుతం చిన్నగురువలూరు, పెద్దగురువలూరు, అల్లాడుపల్లె, వెదురూరు, అనంతపురం, తుమ్మలపాడు, చాపాడు, బద్రిపల్లె, కుచ్చుపాప, బూడిదపాడు రెవెన్యూ గ్రామాల్లో సర్వే ప్రారంభించామన్నారు. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి, రైతులకు సర్వే చేసే రెండు రోజులు ముందుగానే విఆర్ఎల ద్వారా నోటీసులు అందజేస్తున్నామన్నారు. సర్వేలో భాగంగా రైతుల నుండి ఆధార్, ఫోన్ నెంబర్, ఖాతా నెంబర్‌కు సంబంధించి తమ సిబ్బంది సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో లేని రైతులకు ప్రత్యేక దరఖాస్తులు అందజేస్తున్నామన్నారు. ఆధారాలు చూపిస్తే వారి పేరు ఆన్‌లైన్ నమోదు చేయించే అవకాశం ఉంటుందన్నారు. పంట పొలాల్లో జిపిఎస్ రోవర్ ద్వారా హద్దులను గుర్తించి క్యూజి ఐఎస్ సాఫ్ట్‌వేర్‌కు అప్‌డేట్ చేయిస్తున్నామన్నారు. త్వరలోనే రైతులకు విస్తీర్ణాలు తెలియజేస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేస్తామన్నారు. 13 నోటీసులు జారీ చేసి రాళ్ల ఏర్పాటు చేసే చర్యలు చేపడతామని తెలిపారు. వెంగన్నగారి పల్లెలో 146 మంది రైతులకు ఖాతాలకు సంబంధించి 50 సర్వే నెంబర్లను పూర్తి చేసి 300 ఎల్‌పిఎం ఖాతాలు అందించామన్నారు. ఈ గ్రామంలో కూడా రాళ్లను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేలు, ఇతర మండలాల సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. సర్వే ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.



విశ్వనాథపురం వద్ద సర్వే చేపడుతున్న సిబ్బంది

చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలి



చెకుముకి గోడ పత్రికలను అవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రస్థాయిలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించే చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ కోరారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం చెకుముకి గోడ పత్రికలను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులకు చెకుముకి పోటీలు మండల, జిల్లాస్థాయిలో నిర్వహించామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. కడప పట్టణంలోని జయ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి సంబరాలు చేపట్టామన్నారు. జనవిజ్ఞాన వేదిక అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు. చెకుముకి సంబరాలకు పలువురు ప్రొఫెసర్లు హాజరు అవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు వెంకటసబ్బయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, జిల్లా ట్రెజరర్ షామీర్ బాషా, జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు చక్రపాణిరెడ్డి, మండల నాయకులు కేశవులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు, పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోట కట్టాలపల్లె గ్రామంలో విద్యుత్ స్తంభాలు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టామని గండికోట సర్పంచు కె.గురు ఈశ్వర్ తెలిపారు. మండల పరిధిలోని జి.కొట్టాలపల్లెలో శుక్రవారం మరమ్మత్తుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాల లైన్లను పరి శీలించామన్నారు. అవసరమైన చోట వీధి దీపాలు అమర్చామని తెలిపారు. తాగునీరు కుళాయిలు, పైపులు పరిశీలించి, పైపులు పాడైపోయిన చోట వెల్డింగ్ చేయించామన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందు ఉంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేయిస్తున్న సర్పంచు కె.గురుఈశ్వర్

సర్పంచుల ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సర్పంచుల ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయితీలు, మండల, జిల్లా పరిషత్‌లకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిందన్నారు. సవరణ తర్వాత రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎలాగో గ్రామ పంచాయితీలకు సర్పంచులు అలాగే అన్నారు. అయితే వైసిపి పాలన గ్రామ పంచాయితీలు, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీలకు నిధులు, విధులు, అధికారాలు లేక నిర్వీర్యమైనట్లు విమర్శించారు. రూ.8,660 కోట్లు కేంద్ర ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళించడం గర్హనీయమన్నారు. ఆ నిధులను మళ్లీ గ్రామ పంచాయితీ ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థలను గ్రామ పంచాయితీ ఆధీనంలోకి తేవాలని సూచించారు. రాబోవు రోజుల్లో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని తులసిరెడ్డి కోరారు.

రక్తగ్రూపు నిర్ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తమ రక్తగ్రూపు నిర్ధారణ తెలుసుకోవడం తప్పనిసరి అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి మదర్ థెరిస్సా క్లినికల్ ల్యాబ్, పట్టణ ప్రాథమిక వైద్యాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి వయసు పరిమితం కాదన్నారు. అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌తో రక్తహీనత వస్తుందన్నారు. వీటి బదులు ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, రక్తనిధి ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ రఫీ, కళాశాల అధ్యాపకులు బాలనారాయణ, సాయిలీల, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సమస్యను పరిష్కరించడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ఎస్‌సి కాలనీ ప్రజల కోసం మంచినీటి బోరు వేసి సమస్యను పరిష్కరించడం హర్షణీయమని కత్తులూరు మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కత్తులూరు పంచాయితీలోని తాటిమాకులపల్లె ఎస్‌సి కాలనీలో చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో మంచినీటి బోరు వేశారు. దీన్ని శుక్రవారం మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి కాలనీ ప్రజలు చాల రోజుల నుండి తాగునీటికి ఇబ్బందులు పడేవారని తెలిపారు. సమస్య పరిష్కారానికి మహిళా మండలి సంఘం ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ సంస్థ ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిఎంఎం అధ్యక్షురాలు రామాంజనమ్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు పావని, వైసిపి నాయకులు శ్రీను, రామ్మోహన్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, మైకల్, రమాదేవి, చంద్రారెడ్డి, ఎస్‌సి కాలనీ మహిళలు పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి

జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎ.నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2023 -24 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లో జిల్లాలో సాగు చేసే పంటలకు సంబంధించిన పంటల వ్యయాన్ని నిర్ణయించారు. సమావేశంలో బ్యాంకు చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ రాణి, జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్, నాబార్డ్ డీడీఎం విజయ విహారి, డిసిసి బ్యాంక్ సీఈవో రాజేంద్ర కుమార్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, సెరికల్చర్, ఫిషరీస్ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఎన్జీవోలు, ఆదర్శ రైతులు సుబ్బారెడ్డి, రంగారెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, రత్నం పాల్గొన్నారు.

చర్చికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కడప అర్బన్

మరియపురం చర్చి డెవలప్మెంట్ కోసం టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ సురేష్‌తో కలిసి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి, ఆయన సతీమణి మాధవి లక్ష రూపాయలను శుక్రవారం ఫాదర్‌కి అందజేశారు. వారిని ఫాదర్ ఆశీర్వదించారు. కార్య క్రమంలో మరియపురం చర్చ్ కమిటీ సభ్యులు, శివ, రాజశేఖర్, గోవర్ధన్, జీవన్ పాల్గొన్నారు.



చర్చి ఫాదర్ తో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

లూయిస్ బ్రెయిలీకి నివాళి

ప్రజాశక్తి - కడప

అంధులకు ప్రత్యేక లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీకి ఎపి పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు.